

స్వాగతం - సుస్వాగతం
పులివెందుల పట్టణంలో
నూతనంగా నిర్మించిన
వై.యస్. జయమ్మ
మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ను
నేడు ప్రారంభించుటకు
విచ్చేయుచున్న మన ప్రియతమ
రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
శ్రీ వై.యస్.
జగన్ మోహన్ రెడ్డి గారికి
స్వాగతం - సుస్వాగతం.
కె.చంద్రహాస్ రెడ్డి
ఎస్.వెంకటరమణ(కోడి రమణ)
21వ వార్డు కౌన్సిలర్, పులివెందుల
రాధ కన్‌స్ట్రక్షన్స్, పులివెందుల

క్లుప్తంగా

రంజాన్ మాసంలో సెహర్ ఏర్పాటు

జమ్మలమడుగు : రంజాన్ నెల ప్రారంభం రోజు నుంచి పట్టణంలో సెహర్ చేసుకోవటానికి అవకాశంలేని వారికి ఆస్థానయే గౌసియా(పెద్దమకాన్)లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసానికి సంబంధించిన నెలవంక కనిపించిన మరుసటి రోజు తెల్లవారు జామునుంచి రోజా (ఉపవాసాలు) ప్రారంభమవుతుందన్నారు. ఉపవాస దీక్ష చేసేవారు తమ ఆస్థానంలో సెహర్ చేసుకోవచ్చని తెలిపారు. రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ ఐదు పూటల నమాజ్ చేయడం, ఖురాన్ పఠించడం మంచిదని సూచించారు.

31లోగా దరఖాస్తు చేసుకోవాలి

జమ్మలమడుగు: గురుకుల పాఠశాలలో 5వతరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులు ఈనెల 31వతేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని మైలవరం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ప్రభావతి దేవి ఆదివారం ఒకప్రకటనలో పేర్కొన్నారు. ఐదు, 6,7వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 26వతేదీన జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని ఆమె తెలిపారు.

నేడు ఎమ్మెల్యే రాక

వీరపునాయునిపల్లె : స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

అన్నదానం



కార్యక్రమంలో పాల్గొన్న ప్రభాకరరెడ్డి

వేముల : మండలంలోని కస్తూర్బా విశ్వ విద్యాలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలం పరిధిలోని గొంది పల్లె గ్రామానికి చెందిన జయచంద్రారెడ్డి, పార్వతమ్మల కుమారుడు గంగా ప్రసాద్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సర్వశిక్ష అభియాన్ పీఓ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు భోజనం వడ్డించారు.

మానవత్వం చాటుకున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి



లారీ డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీస్తున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం-ఖాజీపేట మండలాల వారధిగా ఉన్న కుందూ వంతెనపై జరిగిన రోడ్డు ప్రమాదంలో బాధితులను ఆదుకుని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున వంతెనపై లారీ ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ఢీ కొన్నాయి. ఆ ఘటనలో లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కుని తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి అక్కడకు చేరుకుని లారీ డ్రైవర్‌ను బయటకు తీసి 108 వాహనంలో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా క్షతగాత్రుడు ప్రసాద్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపాడు.

చలివేంద్రం ఏర్పాటు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మంచినీరు మనిషి ప్రాణాలు నిలిపే ప్రాణధారంగా గుర్తించాలని జేబీవీఎస్ ది ప్రిజర్వేర్ సేవాసమితి వ్యవస్థాపకులు అశోక్, వైస్ ప్రెసిడెంట్ కళావతి తెలిపారు. జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక కడప గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ బయట చలివేంద్రం ఏర్పాటు చేశారు. జేబీవీఎస్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ అధికారంలోకి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- వేంపల్లె నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ



వేంపల్లె : మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

వేంపల్లె : గత ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చేశారని, కాబట్టి మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లె పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఎస్వీ సతీష్‌కుమార్ రెడ్డి, జెడ్పీటీసీ ఎం.రవికుమార్ రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డిలతో కలిసి వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. వేంపల్లె మండలంలో విద్యకు పెద్దపీట వేశారన్నారు. నాడు నేడు కింద పాఠశాలలు ఆధునికీకరణ చేస్తూ...జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, ఉర్దూ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల వంటి నూతన భవనాలను నిర్మించినట్లు తెలిపారు. అలాగే పులివెందులలో మెడికల్ కళాశాలను తీసుకొచ్చారని అన్నారు. ఈ రాష్ట్రానికి, ఈ ప్రాంతానికి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో మేలు చేశారని తెలిపారు. అలాంటి మహనీయుడి విగ్రహావిష్కరణలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. మండలంలో ఎక్కడా సాగు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా కృష్ణా జలాలను తెప్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎందరితో పొత్తులు పెట్టుకున్నా.. కుట్రలు కుతంత్రాలు చేసినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అఖండ మెజారిటీతో గెలిచి మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అవుతారన్నారు. రాష్ట్రంలో కోట్లాదిమంది అన్నదమ్ములు అక్క చెల్లెలు జగనన్నకు తోడుగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీ గాయత్రి, సర్పంచ్ ఆర్ శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీలు షబ్బీర్ వల్లి, డాక్టర్ ఎస్ ఎఫ్ బాషా, హజ్ హౌస్ కమిటీ డైరెక్టర్ మునీర్ భాష, యూత్ కన్వీనర్ రవిశంకర్ గౌడ్, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సింహాద్రిపురం : వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

ప్రగతిబాటలో సచివాలయాలు

సింహాద్రిపురం : ప్రజలకు సేవలు అందించడానికి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాయాలు ఏర్పాటు చేసిందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం బిదినంచర్లలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని, రైతు భరోసా కేంద్రాన్ని పాడా ఓస్డీ అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి అలాగే నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారన్నారు. ముఖ్యమంగా గ్రామాలలో నెలకున్న సమస్యలను సచివాలయాల ద్వారా పరిష్కారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి ఇంటి వద్దకే చేరుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ మండల పరిశీలకుడు వీరశివారెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, జడ్పీటీసీ ఝూన్సీ, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, డైరెక్టర్ కిషోర్‌రెడ్డి, నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, వైఎస్సార్ సీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, అరవిందనాథ్‌రెడ్డి, కేవరెడ్డి, సర్వేశరరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రుషికేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకారశాఖలో పదోన్నతులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా సహకారశాఖలో పనిచేస్తున్న పలువురు అధికారులకు రాష్ట్ర సహకారశాఖ కమిషనర్ పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న దేవిరెడ్డి శ్రీలక్ష్మిని స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పదోన్నతి కల్పించి అదే పోస్టులో జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారిగా నియమించారు. ఈ సందర్భంగా ఆ సంఘం ఏపీ కో ఆపరేటివ్ డిపార్టుమెంటు రిజిస్ట్రార్స్ జిల్లా అధ్యక్షులు పి.సూర్యప్రకాశ్‌రావు అసోసియేషన్ తరఫున అభినందనలు తెలిపారు.

ఉర్దూ భాష పటిష్ట అమలుకు వినతి

వైవీయూ : రాష్ట్రంలో ఉర్దూ భాషాభివృద్ధికి, రెండో అధికార భాషగా ఉర్దూ పటిష్ట అమలుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) నాయకులు కోరారు. ఆదివారం కడప నగరంలో రాష్ట్ర హజ్‌కమిటీ చైర్మన్ గౌస్‌లాజంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రూటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఇక్బాల్, అసోసియేట్ అధ్యక్షుడు పి.షాహీదుల్లా, అదనపు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 80 లక్షల మంది ఉర్దూను తమ మాతృభాషగా ఆదరిస్తున్నారన్నారు. లక్షల సంఖ్యలో విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారన్నారు. ఉర్దూ నేంబోర్డుల ఏర్పాటు, ఉర్దూ భాష అనువాదకుల నియామకం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రూటా నాయకులు ఫక్రుద్దీన్, అబ్దుల్‌హకీం, సిరాజుద్దీన్, జుబేర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ముద్దనూరు : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గడప గడపకు సంక్షేమపథకాల లబ్ధి చేకూరుతోందని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం మండలంలోని ఆరవేటిపల్లె, వేల్పుచెర్ల, రాఘవాపురం, పెద్ద దుద్యాల గ్రామాల్లో ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పారదర్శకంగా సంక్షేమ ఫలాలు అర్హులైన వారందరికీ అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వం పాలనను, ప్రస్తుత పాలనను ప్రజలు గమనించాలని ఆయన కోరారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా మెరుగైన సేవలందుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతు తెలపాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం ఆరవేటిపల్లె గ్రామంలో రూ.7.50లక్షలతో నిర్మించిన రక్షిత తాగునీటి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో దేనేపల్లె సర్పంచ్ పెద్దక్క, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, సుమంత్, శ్రీనివాసులు, శివారెడ్డి, కులశేఖర్‌రెడ్డి, లక్ష్మినారాయణ, శివ, సుధాకర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే గాంధీజీ కన్న కలలు సాకారం



సచివాలయ కాంప్లెక్స్ శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



సంబటూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : ప్రతి గ్రామంలో సచివాలయం నిర్మించి జగనన్న గాంధీజీ కన్న కలలు సాకారం చేశారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, అగ్రికల్చర్, హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్లు తిరుపాల్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎర్రగుడిపాడులో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్బీకే, హెల్త్ క్లినిక్, మిల్క్ సెంటర్‌లను వారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అంతకు ముందు లేటపల్లెలో రాష్ట్ర నాయకుడు వంశీనాథ్‌రెడ్డితో కలసి ఎమ్మెల్యే సచివాలయం భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయనంత అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టారన్నారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు తీసుకువచ్చి పింఛన్, రేషన్ అన్ని పథకాలు ఇంటి వద్దకే అందిస్తున్న జగనన్న పాలనను దేశం అంతా చూస్తోందన్నారు. ఇంత మంచి పాలన అందిస్తున్న జగనన్నను సీఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నకేశవరెడ్డి, వెంకటలక్షుమ్మ, పిచ్చిరెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి

జనరంజక పాలన అందించిన జగనన్న ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరో సారి జగనన్నను సీఎం చేయాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆయన కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని సంబటూరు, చెన్నంపల్లె, మొలకవారిపల్లె గ్రామాల్లో వారు ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ముందుగా సచివాలయం వద్ద స్టేట్ హార్టికల్చర్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించిన మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే వైఎస్సార్ పార్క్‌ను, ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి తిరిగి జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా రవీంద్రనాథ్‌రెడ్డిని, ఎంపీగా అవినాష్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, కరుణ్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, గంగాధర్‌రెడ్డి, సాదిక్, శ్రీనివాసరెడ్డి, ఇస్మాయిల్, హిదాయత్, ఇర్ఫాన్, గఫార్, మస్తానయ్య, సునీల్‌రెడ్డి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఫ్యాక్షనిజాన్ని పోనించుకోలేదు

టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డికి ప్రజా స్వామ్యం వచ్చి ఇన్ని సంవత్సరాలు అయినా ఫ్యాక్షనిజం మెంటాలిటీ పోలేదని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం మండలంలోని సంబటూరులో వైఎస్సార్ పార్క్, స్టాచ్యూ ప్రారంభోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. నిన్న వలంటీర్ల కాళ్లు చేతులు నరికేస్తాం అన్న పుత్తా ఈ రోజు కనబడిన వారందరిని కొట్టడం పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. 4-5 సార్లు ఓడిపోయినా అని చెప్పడం కాదు ప్రజాస్వామ్యంలో ఎలా బతకాల్లో నేర్చుకోవాలని హితవు పలికారు. ముందు ఫ్యాక్షనిజం మెంటాలిటీ తొలగించుకోవాలని ఆయన హితువు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



లయోలా పాలిటెక్నిక్ కళాశాల పూర్వవిద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ తదితరులు

పులివెందుల టౌన్ : స్థానిక లయోలా పాలిటెక్నిక్ కళాశాలలో సీఎస్ఇ బ్రాంచ్ 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం 1990-2024 బ్యాచ్ పూర్వ విద్యావిద్యార్థులు కళాశాలలో సిల్వర్ జుబ్లీ నిర్వహించారు.

కళాశాల కరస్పాండెంట్ ఆంటోనిస్వామి, ప్రిన్సిపాల్ బ్రిట్టోలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. 150మందికి పైగా పూర్వవిద్యార్థులు కలసి రావడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు.అనంతరం పూర్వవిద్యార్థులు తమ అనుభవాలను నెమరేసుకున్నారు. అధ్యాపకులు ఓర్పుతో తమకు నేర్పిన విద్యవల్లే ఈస్థాయికి ఎదిగామని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఇ హెచ్ఓడీలు విశ్వనాథరెడ్డి, అశోక్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'లంకమల దారుల్లో' సాహిత్యం, మానవీయత



లంకమల దారుల్లో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం సంచాలకులు, ఇతర అతిథులు

కడప కల్చరల్ : లంకమల దారుల్లో పేరిట లంకమల వివేక్ రచించిన పుస్తకంలో మనదైన భాష సౌందర్యం, సాహిత్యం, సహజమైన ప్రకృతి శోభను ఆస్వాదించేందుకు చేసిన సాహసం, మానవీయత కలగలసి ఉన్నాయని వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, ఇన్ టు ద నేచర్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో లంకమల వివేక్ రచించిన లంకమల దారుల్లో పుస్తక పరిచయ కార్యక్రమాన్ని బ్రౌన్ కేంద్రంలో నిర్వహించారు. సంస్థ సభ్యులు శివరాచర్ల కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ పుస్తకం, దాని నేపథ్యం గురించి వివరించారు. ముఖ్య అతిథిగా హాజరైన బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రాం ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకం కేవలం యాత్ర, సాహిత్యమే కాకుండా విజ్ఞానం కథాంశాలతో కూడిన విశ్లేషణాత్మక రచనగా పేర్కొన్నారు. ఇన్ టు ద నేచర్ సంస్థ సభ్యులంతా లంకమల అడవుల్లో కలియ దిరిగి తమ రేయింబవళ్ల అనుభవాన్ని పుస్తకంగా అందరికీ అందుబాటులోకి తెచ్చారన్నారు. బద్వేలు ఆర్డీఓ ఆకుల వెంకట రమణ మాట్లాడుతూ ఇన్ టు ది నేచర్ సంస్థ ద్వారానే లంకమల ప్రాంత యానాదులకు ఆధార్‌కార్డులు మంజూరు చేశామన్నారు. ఓ పత్రిక సంపాదకులు చెన్నుపల్లి వెంకటరెడ్డి, కథా రచయిత పాలగిరి విశ్వప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న మనకు తెలియని అద్భుతమైన అటవీ సంపద, సౌందర్యం కలిగి ఉన్న పల్లె జీవుల జీవితం గురించి వివేక్ గొప్పగా రాశారని పేర్కొన్నారు. జలధారలు బృందం సభ్యులు పులివెందుల వివేక్ మాట్లాడుతూ నిర్దేశించిన గమ్యంతో సాగిన తమ ప్రయాణంలో అనేక మలుపులు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఇంకా బృందం సభ్యులు సరస్వతి, గోవర్ధన్‌రెడ్డి, సుధీర్ రెడ్డి మాట్లాడారు. రచయిత వివేక్ లంకమల మాట్లాడుతూ ఈ కృషి వెనుక తన కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారం ఉన్నాయన్నారు. అరణ్యశేఖర్ సభను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైవీయూ అధ్యాపకులు ఆచార్య రమాదేవి, కాత్యాయిని, బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ఉపాధ్యాయిని రామాయణం రాజేశ్వరి, గ్రంథాలయ సహాయకులు వివేక్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

వైవీయూ : ప్రతి ఒక్కరూ చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగరంలోని జెమ్స్ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2015 గురించి వివరించారు. దేశభక్తి, లోకాయుక్త, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, ప్రాథమిక హక్కులు, విధులు, భారతీయ శిక్షాస్మృతి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అబ్దుల్‌హక్ విశ్వవిద్యాలయం విశ్రాంత రిజిస్ట్రార్ సత్తార్‌సాహిర్, వైవీయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య జి.గులాంతారీఖ్, ప్రసాద్, అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

వైవీయూ : రాష్ట్రంలో పని చేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున కోరారు. ఆదివారం కడప నగరం ఆర్‌టీసీ బస్టాండు సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి వారు వినతిపత్రాన్ని అందజేశారు.

అభివృద్ధి సంక్షేమ ప్రదాతను ఆశీర్వదించండి

– వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా



చెన్నూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కరీముల్లా తదితరులు

చెన్నూరు : కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి ఆశీర్వదించాలని వేర్ హౌస్ కార్పొరేషన్ చైర్మన్ కరీముల్లా అన్నారు. ఆదివారం చెన్నూరు మైనార్టీ కాలనీలో వైఎస్సార్ సీపీ మైనార్టీ నాయకులతో కలిసి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిలకు మద్దతుగా ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు,

ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చి న హామీలను నెరవేర్చారన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం తరఫున లబ్ధి జరిగి ఉంటేనే తనకు ఓటు వేయాలని చెప్పే దమ్మున్న ఏకై క ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గతంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు జన్మభూమి కమిటీలతో తన వారికి లబ్ధి చేకూర్చుకోవడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు, నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అర్హులందరికీ పథకాలు అందేలా చేశారన్నారు. అవ్వ తాతలు, అక్కా చెల్లెమ్మలు, అన్నదమ్ములు, అందరూ ఆలోచించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు, ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు గుమ్మ రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, జీఎస్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షులు అల్లి శ్రీరామమూర్తి, ఎర్ర సాని నిరంజన్ రెడ్డి, గుమ్మల్ల సాయిరెడ్డి, మైనార్టీ నాయకులు, అన్వర్‌బాషా, ఫషీర్ జుమన్, వారిస్, సాదిక్ అలీ, హజ్రత్, సాదక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల అభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.రవీంద్రనాథ్

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ కోరారు. ఆదివారం కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ప్లాటినం జూబ్లీ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో కళాశాలల చదివిన విద్యార్థులందరూ భాగస్వాములు కావడంతో పాటు సహకారం అందించాలని సూచించారు. కడప మాజీ మున్సిపల్ చైర్మన్ ఎస్. హరీంద్రనాథ్ మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన కళాశాలలో చదివిన వారెందరో ఉన్నతస్థానాలకు చేరుకున్నారన్నారు. అందరూ కలిసివస్తే కళాశాలను మరింత అభివృద్ధిపథంలో నడిపించవచ్చని తెలిపారు. కళాశాల అభివృద్ధి మండలి సభ్యులు లయన్ కె. చిన్నపరెడ్డి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడారు. అనంతరం అందరితో చర్చించిన తర్వాత కళాశాల ప్లాటినం జూబ్లీ ఉత్సవాలను ఈ యేడాది ఆగస్టు 12,13 తేదీల్లో నిర్వహించేలా ప్రణాళికలు రూపొందించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం.రమేష్, పూర్వ విద్యార్థులు సుబ్బిరెడ్డి, ఎస్ఎం బాషా, ఎం. వెంకటసుబ్బయ్య, మురళీధర్, చెన్నారెడ్డి, గురుమోహన్, శివరాం, నాగరాజు, రామకృష్ణ, రాజశేఖరరెడ్డి, విశ్వనాథ్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి సమస్యలపై అవగాహన అవసరం



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కంటి సంబంధిత సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆదివారం ప్రపంచ గ్లాకోమా దినోత్సవం సందర్భంగా కడపలోని పుష్పగిరి విట్రియో రెటినా ఇన్‌స్టిట్యూట్, డీబీసీఎస్ ఆధ్వర్యంలో గ్లాకోమాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కడపలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల నుంచి రాజీవ్ పార్కు మీదుగా తిరిగి ఆర్ట్స్ కళాశాల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ క్రమం తప్పకుండా తనిఖీ చేయడం వల్ల సైలెంట్ కిల్లర్ గ్లాకోమాను నివారించవచ్చన్నారు. అనంతరం ప్రతి సంవత్సరం మార్చి 2వ వారంలో నిర్వహించే ప్రపంచ గ్లాకోమా వారం ప్రాముఖ్యతపై సూర్య ప్రకాష్ ప్రసంగించారు. ర్యాలీ సందర్భంగా పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్లాకోమా వ్యాధిపై అవగాహన, నిర్వహణపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ ర్యాలీలో పుష్పగిరి కంటి ఆసుపత్రి యూనిట్ జీఎం సురేష్, డీపీఎం డాక్టర్ సునీత, సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

జగనన్న ప్రభుత్వంలో పేదలపై వరాల జల్లు

- గడప గడపకు మన ప్రభుత్వం'లో డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజద్ బాషా


'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాలనలో పేద ప్రజలపై వరాల జల్లు కురిపించారని ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్ బాషా అన్నారు. ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా 1వ డివిజన్ పాతకడప సచివాలయం-1 ప్రాంతంలో ఆయన ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందుతున్న లబ్ధి సమాచారంతో బుక్ లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పాదయాత్రలో పేదల కష్టాలు తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆ కష్టాలను తొలగించేలా మేనిఫెస్టో ప్రకటించి, అమలు చేసి చూపించారన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో ఇంత పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కాలేదని చెప్పారు. కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నిండు దీవెనలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 1వ డివిజన్ కార్పొరేటర్ ఆర్.చెన్నయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జరుగు రాజశేఖర్‌రెడ్డి, అహమ్మద్‌బాషా, పి.జయచంద్రారెడ్డి, సీహెచ్ వినోద్, దాసరి శివ, ఎస్.సుబ్బారెడ్డి, కె.కొండయ్య, ఏ.బాలక్రిష్ణారెడ్డి, షఫీ, బండి ప్రసాద్, షఫీవుల్లా, లక్ష్మినారాయణ, సుశీలమ్మ, మల్లీశ్వరి, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్ : కడప నగరం అగాడిలోని అర్రహ్మాన్ సొసైటీ కార్యాలయంలో పేద ముస్లింలకు ఆదివారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. స్థానిక ప్రముఖులు సయ్యద్ జాఫర్ హుసేన్ దాతృత్వంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా పాల్గొన్నారు. అర్రహ్మాన్ ఇందాద్ వెల్ఫేర్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసం ప్రారంభమవుతున్న శుభ సందర్భంగా దాదాపు 490 మందికి నిత్యావసర సరుకులు మూడు లక్షల 67 వేల 10 రూపాయలతో రంజాన్ సరుకుల కిట్లను పంపిణీ చేసిన సంఘ సేవకులు సయ్యద్ జాఫర్ హుస్సేన్ అభినందనీయులన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

◆ఘనంగా భస్మహారతి


భస్మహారతి అందుకుంటున్న అగ్స్యేశ్వరస్వామి

స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ఘనంగా భస్మహారతి నిర్వహించారు. వేకువజామున స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వామివారికి వేదపండితులు మంత్రోచ్చారణలతో సహస్రనామ భస్మార్చన, భస్మహారతి ఇచ్చారు.

- అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని కాలక్షేపం మండలంలో గండ్లూరి వీరప్రతాప్‌రెడ్డి, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ఆదివారం హనుమాన్ సేవక్ డాక్టర్ పోలా ప్రగడ శ్రీనివాస స్వామిజీచే సుందరకాండ సప్తాహ పారాయణం ఏర్పాటు చేశారు. సోమవారం ముగింపు సందర్భంగా ఉదయం 10.45 గంటలకు సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహిస్తున్నారని, భక్తులు పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి కోరారు.

–ప్రొద్దుటూరు కల్చరల్

మహిళా లోకానికే ఆదర్శం సావిత్రిబాయి


సావిత్రిబాయి పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్: మహిళా లోకానికే సావిత్రిబాయి పూలే ఆదర్శమని మున్సిపల్ వైస్‌చైర్మన్ వై.గోపాల స్వామి, మహాత్మ జ్యోతిరావ్ పూలే ఆశయ సాధన సమితి చైర్మన్ బి.గురుమూర్తి పేర్కొన్నారు. సావిత్రిబాయి 127వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సిద్దవటం రోడ్డులోని సావిత్రిబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత ప్రప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే అని, ప్రతి మహిళ ఆమెను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, బద్వేలు పౌరవేదిక చైర్మన్ పెద్దిరెడ్డి సతీష్‌రెడ్డి, పూలే విగ్రహ నిర్మాణ కమిటీ వైస్‌చైర్మన్ వెంకటస్వామి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బయ్య యాదవ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణయాదవ్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జి.పుల్లయ్య, ఎం.పిచ్చయ్య, ఆవాజ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తార్, రసూల్, బీసీ హాస్టల్ వార్డెన్ ప్రసాద్, దళిత నాయకులు మునెయ్య, చిన్నయ్య పాల్గొన్నారు.

మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి


నేనూ సావిత్రిబాయి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హేమాంజలి, వరలక్ష్మి

ప్రొద్దుటూరు కల్చరల్: మహిళా విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి అని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ హేమాంజలి కొనియాడారు. ఆదివారం స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో సావిత్రి బాయి వర్ధంతి సందర్భంగా 'నేనూ .. సావిత్రిబాయిని' అనే పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హేమాంజలి మాట్లాడుతూ తాను చదవడమే కాకుండా తొలి మహిళా ఉపాధ్యాయురాలై అనే మంది మహిళలను విద్యావంతులను చేసిన ఘనత సావిత్రిబాయిదేనని గుర్తుచేశారు. ఈ సంవత్సరం మహిళా దినోత్సవం థీమ్ ప్రకారం మహిళా పెట్టుబడితోనే సాధ్యం అవుతుందని అన్నారు. విరసం రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు వరలక్ష్మి మాట్లాడుతూ రోజుకు 15 గంటల పని నుంచి అనేక పోరాటాల ద్వారా మహిళలు 8 గంటల పని విధానాన్ని, ఓటు హక్కును, పురుషులతో సమానంగా వేతనాన్ని అందుకున్నారన్నారు. ప్రతి మహిళ సమానత్వం కోసం కృషి చేయాలన్నారు. హెల్త్ అడ్వైజర్ చంద్రకళ, డాక్టర్ సమిత మాట్లాడుతూ ఆడ పిల్లల పట్ల లింగ వివక్షత చూపకూడదని, వరకట్నం ఇవ్వడాన్ని మహిళలు వ్యతిరేకించాలన్నారు. నేనూ.. సావిత్రిబాయిని పుస్తకాన్ని లాయర్ హరిత పరిచయం చేస్తూ ఈ పుస్తకాన్ని ఓల్గా అతి సరళమైన భాషలో తెలుగులోకి అనువదించారని, దీనిని జన విజ్ఞాన వేదిక తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమత కన్వీనర్ దేవమణి, జేవీవీ పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, హేమలత, మీనా, కార్తీక, సరోజ, సన, మురళిగుప్తా, తవ్వా సురేష్, మధుసూదన్ రెడ్డి, పోలంకి శ్రీరాములు, ప్రకాష్, చదువుల బాబు, కోఆర్డినేటర్స్ అభినయ్, యోచిత, అక్షయ, సాయి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.8 లక్షల చెక్కులను ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ ఆదివారం శ్రీరాములపేటలోని తన కార్యాలయంలో లబ్ధిదారులకు అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద ప్రజల వైద్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారని కొనియాడారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 5 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన దాదాపు రూ.8లక్షల చెక్కులను అందజేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


1996-97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక కొట్టి హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 1996-97 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా గురువులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు. గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థీ వివిధ వృత్తుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడుపుతున్నట్లు పేర్కొన్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పి ఉన్నతంగా తీర్చిదిద్దిన గురువులను గుర్తు తెచ్చుకున్నారు.

గంగమ్మ జాతర.. చూసొద్దామా!

- నేటి నుంచి ప్రారంభం కానున్న అనంతపురం గంగమ్మ జాతర
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ


గొల్లపల్లె గంగమ్మ దేవత అమ్మవారి మూలవిరాట్‌కు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గంగమ్మ జాతర సోమవారం ప్రారంభం కానుంది. లక్షల్లో భక్తులు తరలి రానున్నారు. భక్తులకు చలువ పందిళ్లు ఏర్పాటు చేయడంతోపాటు అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే మహిళలకు శాశ్వత స్నానపు గదులను, మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకువచ్చారు. ఆలయం మొత్తం విద్యుత్ దీపాలతో అలంకరించడంతో కొత్తశోభ నెలకొంది. జాతరకు ఇప్పటికే మిఠాయిబండ్లు, చెరుకుల బండ్లు, హోటళ్లు, శీతల పానీయాల దుకాణాలు, రంగుల రాట్నాలు, సర్కస్ కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. దాతల సహకారంతో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించేదుకు పొరుగు రాష్ట్రం నుంచి పూలను తెప్పించనున్నారు. ఆలయ చైర్మన్ మురికినాటి రెడ్డయ్య, ప్రత్యేక అధికారి రవీంద్రరాజు, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డిలు ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాయచోటి డీఎస్పీ మహబూబ్ బాషా, సీఐ జీవన్ గంగనాథ బాబు, ఎస్ఐ విష్ణువర్ధన్ బాబు, తమ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపట్టారు. భక్తుల దాహార్తి తీర్చేందుకు లక్కిరెడ్డిపల్లెకు చెందిన విలేకరులతో పాటు అయ్యప్ప సేవాసమితి, గంగమ్మ తల్లి సేవా సమితి, మానవతా స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు, నీళ్ల ప్యాకెట్లను పంపిణీ చేయనున్నారు. ఆలయ అర్చకులు చెల్లు నారాయణ వంశీయులు శ్రీనివాసులు, రవి, మునీంద్ర, సూరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు


బండ లాగుతున్న ఎద్దులు

రాజంపేట టౌన్ : త్రేతేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా రాజంపేట మండలం హత్యరాలలో ఆదివారం అన్నమయ్య, వైఎస్సార్‌జిల్లాల స్థాయిలో నిర్వహించిన బండలాగుడు పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. ఈపోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలి వచ్చారు. బండలాగుడు పోటీలను త్రేతేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి ప్రారంభించారు. ప్రథమ బహుమతి రూ.50 వేలను అన్నమయ్య జిల్లా నందలూరుకు చెందిన షేక్ హబీబుల్లా ఎద్లు గెలుపొందాయి. ద్వితీయ బహుమతి రూ.40 వేలు వైఎస్సార్‌జిల్లా కమలాపురం మండలం జంగంపల్లెకు చెందిన పుత్తా నాగసుబ్బారెడ్డి ఎద్లు, తృతీయ బహుమతి రూ.30 వేలు అన్నమయ్యజిల్లా కుందనకోటకు చెందిన గుజ్జల చెన్నప్ప ఎద్లు, నాల్గవ బహుమతి రూ.20 వేలు వైఎస్సార్‌జిల్లా వేముల మండలం రాగోరిపల్లెకు చెందిన మూలె రామసుబ్బారెడ్డి ఎద్లు, ఐదవ బహుమతి రూ.10 వేలను వైఎస్సార్‌జిల్లా ఎర్రగుంట్లకు చెందిన సంగటి బాబుకు చెందిన ఎద్లు గెలుపొందాయి. త్రేతేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన రథోత్సవం, బండలాగుడు పోటీల సందర్భంగా డీఎస్పీ వీఎన్‌కే.చైతన్య ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

కారు- బైకు ఢీ.. వృద్ధుడి మృతి

రామాపురం: కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీ బ్రిక్స్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గునిశెట్టి నారాయణ(68) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు రాయచోటి పట్టణం మాసాపేట గ్రామం రెడ్డివారిపల్లెకు చెందిన బేల్దారి నారాయణ తన సమీప బంధువు రామాపురం మండలం నల్లగుట్టపల్లె గ్రామం కొత్తపల్లిలో గంగమ్మ జాతరకు బోనాలు పెడుతుండడంతో తన ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. కొత్తపల్లికి వెళ్లే రోడ్డును దాటుతుండగా రాయచోటి వైపు నుంచి కడప వైపు వెళ్తున్న ఏపీ28 డీయూ 0002 నంబరు గల కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం 108లో లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీఎల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

బైకును ఢీకొన్న కారు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట పంచాయతీ, బైపాస్ రోడ్డు వద్ద ఆదివారం టీఎస్07 కేఈ1923ఎక్స్‌యువీ700 అనే నంబరుగల కారు బైకును ఢీ కొనడంతో బైకుపై ప్రయాణిస్తున్న వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని వద్ద లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా పోలీసులు తిరుమలలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న శేషయ్య కుమార్ (45)గా గుర్తించారు. మృతుని వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.